TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 215 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ సోమవారం.02.03.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

రిపోర్టర్లు కావలెను

TGTEL/25/A1907 అమృత్ తెలంగాణ తెలుగు దిన పత్రిక

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న

TGTEL/25/A1907 అమృత్ తెలంగాణ తెలుగు దిన పత్రిక

మీకు సరైన వేదిక... అన్ని జిల్లాలు, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.

ఇంకెందుకు ఆలస్యం

9849973404, 6304156955

వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## అండగా ఉంటాం...ఆందోళన వద్దు



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. 2025 నవంబర్ 17న సౌదీ అరేబియాలోని మదీనాలో జరిగిన బస్సుప్రమాదంలో నగరానికి చెందిన 44 మంది కుటుంబసభ్యులు మరణించిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున సీఎం పరిహారం చెక్కులు అందచేశారు. అదే ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తికి రూ.3 లక్షలు పరిహారం అందించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఎం ఈ చెక్కులను బాధిత కుటుంబాలకు అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం బయట జరిగే ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించవనీ, కానీ బాధితుల కుటుంబాల పరిస్థితి చూసి సహాయం ప్రకటించామని తెలిపారు. పరిహారం అంశాన్ని రాష్ట్ర మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. ఇటీవల నాంపల్లిలో జరిగిన అగ్నిప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలను కూడా ఆదుకున్నామని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకం కల్గించడం కోసమే ఆయా కుటుంబాలను సెక్రటేరియట్‌కి పిలిచి పరిహారం అందిస్తున్నామని తెలిపారు. ఆనాడు ప్రమాదం గురించి తెలియ గానే సహాయ చర్యల పై కేంద్రంతో తానే స్వయంగా మాట్లాడాననీ, మంత్రి అజారుద్దీన్‌ను మదీనా పంపించి తదుపరి కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు.

'ఇది మీ ప్రభుత్వం.ఆందోళన వద్దు. మీ కష్టం, ఆనందంలో మీకు తోడు గా ఉంటాం' అని భరోసా ఇచ్చారు. ముస్లిం సోదరులకు రంజాన్ మాసం అత్యం త పవిత్రమైనదనీ, అంతా కలిసి మెలిసి ముందుకు వెళ్దామని చెప్పారు. 2009 నుంచి కొడంగల్‌లో ఏటా ఒక్కో మండలం నుంచి ఒకరి చొప్పున తానే స్వయంగా హజ్‌కు పంపిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎంఓ ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మాజిద్ హుస్సేన్, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ చైర్మెన్ ఫహీమ్ ఖురేషి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధం ఎఫెక్ట్.. భారతదేశంలో పెట్రోల్, డీజిల్ రేట్లతోపాటు.. వాటి ధరలు భారీగా పెరగనున్నాయా..?




న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: ఇరాన్ పై ఇజ్రాయెల్ -- అమెరికా దాడులకు కారణంగా ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ సెగలు రేగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పరుగులు తీయడం ప్రారంభించాయి. ఇంకొన్ని రోజులు ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం కొనసాగితే భారతదేశంలోనూ పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగే చాన్స్ ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

భారత దేశం ప్రస్తుతం అమెరికా, పశ్చిమ ఆఫ్రికా, లాటిన్ అమెరికాతో పాటు 40కిపైగా దేశాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటుంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో భారతదేశం తన ముడి చమురు దిగుమతిని సర్దాబాటు చేసుకోవడానికి సహాయపడింది. అయితే, అమెరికా లేదంటే లాటిన్ అమెరికా నుంచి చమురు భారతదేశానికి చేరుకోవడానికి చాలా ఎక్కువ సమయం పడుతుంది. గల్ఫ్ నుంచి కేవలం ఐదు నుంచి ఆరు రోజుల్లో ముడి చమురు భారతదేశానికి చేరుతుంది. అదే అమెరికా, లాటిన్ అమెరికా నుంచి అయితే నెల నుంచి నెలన్నర సమయం పడుతుంది. దీనివల్ల మధ్యప్రాచ్య చమురు చౌకగా, రవాణా వేగంగా జరుగుతుంది.

మధ్యప్రాచ్యంలో సంక్షోంభం ప్రపంచ ముడి చమురు సరఫరాలో 20 నుంచి 25శాతం వాటా కలిగిన హోర్ముజ్ జల సంధి ద్వారా సరఫరాలకు ఆటంకం కలిగించవచ్చు. రష్యా చమురుపై ట్రంప్ ఆంక్షల మధ్య ఇటీవల కాలంలో హోర్ముజ్ జలసంధి గుండా భారతదేశం చమురుకు ఎక్కువ మొత్తంలో రవాణా చేస్తోంది. కెప్లర్ నౌక ట్రాకింగ్ డేటా ప్రకారం.. భారతదేశం ముడి చమురు దిగుమతుల్లో రోజుకు దాదాపు 2.5 నుంచి 2.7 మిలియన్ బ్యారెళ్లు జలసంధి ద్వారానే రవాణా ఉంటుంది. ఇది భారతదేశం మొత్తం ముడి చమురు దిగుమతుల్లో 50శాతం. ఈ చమురులో ఎక్కువ భాగం ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ నుంచి వస్తుంది. ఇరాన్ హోర్మజ్ జలసంధిని మూసివేస్తే.. ప్రభావం భారతదేశంపై పడబోతోంది. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం వెంటనే ముగియకుంటే భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగే చాన్స్ ఉంటుంది.

మరోవైపు.. ఇరాన్ కు భారతదేశం చేసే టీ ఎగుమతులు కూడా దెబ్బతినే అవకాశం ఉందన్న ఆందోళన నెలకొంది. 2024 -- 2025 సంవత్సరంలో భారతదేశం దాదాపు రూ.7బిలియన్ల విలువైన టీ ఎగుమతులను ఇరాన్ కు పంపించింది. మరోవైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ ప్రారంభమైనప్పటి నుంచి భారత దేశంలోని బాస్మతి బియ్యం ఎగుమతులు దాదాపు ఆగిపోయాయి.

భారతదేశం నుంచి ఇరాన్ కు ఎగుమతి చేయబడిన బాస్మతి బియ్యం రవాణా ప్రస్తుతం రవాణాలో ఉంది. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరానియన్ దిగుమతిదారులు ఈ బాస్మతి బియ్యాన్ని డెలివరీ చేయగలరా లేదా అనే దానిపై అనిశ్చితి నెలకొంది. ఉద్రిక్తతలు కొనసాగితే.. మధ్య ఆసియా అంతటా బియ్యం ఎగుమతులపైనా ప్రభావంచూపుతుందని నిపుణులు చెబుతున్నారు. భారతదేశం నుంచి భాస్మతి బియ్యాన్ని కొనుగోలు చేసే దశాల్లో ఇరాన్ మొదటి స్థానంలో ఉంది. దీంతో ఆ రంగానికి చెందిన వారిలో ఆందోళన నెలకొంది.

## ఇరాన్ సుప్రీం లీడర్ మృతి.. ధ్రువీకరించిన ఇరాన్ మీడియా



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:ఇరాన్‌కు గట్టి దెబ్బ తగిలింది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఇరాన్ మీడియా ధ్రువీకరించింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో శనివారం ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా భీకర దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఖమేనీ కార్యాలయం లక్ష్యంగా జరిగిన భారీ దాడుల్లో ఆయన మరణించారని ఇరాన్ మీడియా పేర్కొంది. దీంతో 40 రోజుల పాటు సంతాప దినాలు పాటించనున్నట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. ఖమేనీ మృతి చెందినట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన కొద్దిసేపటి తర్వాత ఇరాన్ ఈ మేరకు ధ్రువీకరించింది.

## సీఎంకి 2 ఇళ్లు, డిప్యూటీ సీఎంకి 3 ఇళ్లు ఉండొచ్చు.. పేదల ఇళ్లు కూలగొడతారా?: కేటీఆర్




హైదరాబాద్, అమృత్ తెలంగాణ: సుందరీకరణకు మేము వ్యతిరేకం కాదు.. సీఎం రేవంత్ రెడ్డి ఇండ్లు కూలగొట్టడం మానుకొని.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం వేల మంది పేదలు, మధ్యతరగతి కుటుంబాల ఇండ్లను కూల్చివేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ బాధితులు హైదరాబాద్ షా కోట్‌లో 'మూసీ దండి మార్చ్' పాదయాత్ర చేపట్టారు. కేటీఆర్ ఈ పాదయాత్రలో పాల్గొని బాధితులతో కలిసి నడిచారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

హైద్రాబాద్ ఓఆర్ఆర్ లోపల కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా ప్రజలు ఇవ్వలేదు. గ్రామీణ ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇండ్లు కూలగొట్టడం కాదు.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. హైడ్రా పేరుతో కూడా ఇండ్లు కూల్చారు. చిన్న పిల్లలు గల్ల బుడ్డి ఇచ్చి రేవంత్ రెడ్డికి ఇవ్వమని చెబుతున్నారు.. రేవంత్ రెడ్డిలా అక్రమ సంపాదనతో కట్టుకున్న ఫ్యాలెస్‌లు ఇక్కడి ప్రజలకు లేవని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి ఆయన చేతిలో పెట్టి వెళ్ళాం.. కానీ, రేవంత్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధిని పాతాళానికి తీసుకెళ్లాడంటూ కేటీఆర్ విమర్శించారు.

ముఖ్యమంత్రి విలాసవంతమైన ఇల్లు కట్టుకున్నాడు. ఆయన కోట కంచెకు తొమ్మిది కోట్లు. ఉప ముఖ్యమంత్రికి మూడు ఇండ్లు, ముఖ్యమంత్రి రెండు ఇండ్లు ఉండాలి. పేదవారికి మాత్రం ఇండ్లు ఉండకూడదు.. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. హైద్రాబాద్ లో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపిస్తే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ సవాల్ చేశారు. డీపీఆర్ లేకుండా ఇండ్లును ఎలా కూలుస్తారంటూ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యం అంటున్నారు.. మరి తెలంగాణలో ఏంది అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.

రేవంత్ రెడ్డి సొంత ఇల్లు కొండగల్‌లో కుంటలో ఉంది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు బఫర్ జోన్‌లో ఉంది. ఇక్కడ మాత్రం వేల కుటుంబాలను రోడ్డున పడేయాలని చూస్తున్నారు. రెండేళు మీరు మీ భూములను, ఇండ్లను కాపాడుకోండి.. రెండేళ్లలో మేము అధికారంలోకి వస్తాం. మీ ఇంటికి సున్నం కూడా పోకుండా మేము చూసుకుంటామని కేటీఆర్ అన్నారు. ఈ దుర్మార్గుడి నుంచి తెలంగాణను కాపాడుకోవాలి. ఏసీలో కూర్చోవద్దు.. అవసరం అయితే ప్రతి ఒక్కరూ ప్రజలకోసం బయటకు రండి అంటూ కేటీఆర్ పిలుపునిచ్చారు.

## బీజేపీ పతనం ప్రారంభమైంది : కేజ్రీవాల్



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: బీజేపీ పతనం ప్రారంభమైందని ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో నిర్దోషిగా విడుదలైన అనంతరం ఆయన ఆదివారం జంతర్ మంతర్‌లో ఏర్పాటు చేసిన మొదటి బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ అవినీతిపరుడు అని, బీజేపీ పతనం ప్రారంభమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మిత్రులారా.. ఇది జంతర్‌మంతర్. ఇక్కడి నుండే ప్రజలు కాంగ్రెస్‌ను తరిమికొట్టారు. జంతర్‌మంతర్‌కి ఈరోజు చారిత్రాత్మక రోజు కానుంది. నేటి తారీఖును గుర్తుంచుకోండి. నేటి నుండే బిజెపి పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది" అని పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రధాని మోడీచర్యలు తీసుకోరు. ఎందుకంటే ఆయన వ్యక్తిగతంగా అవినీతిలో పాలుపంచుకుంటున్నారు లేదా ఆయన పార్టీ సభ్యులు లేదా స్నేహితులు భారీ స్కామ్‌లలో భాగస్వాములై ఉన్నారు. నేను అవినీతిపరుడిని కాదు. మోడీ అవినీతి చేస్తున్నారు" అని మండిపడ్డారు.

తాను పదేళ్లు ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నానని, ప్రధాని మోడీ తనపై ఎన్ని దాడులు చేశారో తనకు తెలియదని, అయితే ఒక్క పైసా అవినీతిని కూడా కనుగొనలేదని అన్నారు. "పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న నేను చాలా ఫైళ్లపై సంతకాలు చేశాను. ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన ఒక కాంట్రాక్టర్ లేచి నిలబడి కేజ్రీవాల్ నన్ను డబ్బు అడిగారు అని చెప్పినా నేను రాజకీయాలను వదిలేస్తాను" అని అన్నారు. మద్యం పాలసీ కేసులో ఢిల్లీ కోర్టు ఇచ్చి తీర్పుపై ప్రజలను అభినందించాలనుకుంటున్నానని అన్నారు. గత నాలుగేళ్లుగా, మోడీ, అమిత్‌షాలు కుట్రతో ఢిల్లీ ప్రజలను చాలా ఇబ్బంది పెట్టారు. కానీ ఢిల్లీ కోర్టు మోడీజీ మీరు అబద్ధం చెబుతున్నారు. కేజ్రీవాల్ నిజాయితీ పరుడని అన్నారు."ప్రజలు మోడీ ప్రభుత్వాన్ని 30 ఏళ్ల తర్వాత పూర్తి మెజారిటీతో ప్రభుత్వంగా చేశారు. నేడు బ్యాంకులు, రైల్వేలు, విద్య, ఆస్పత్రులు, గ్రామాలు, ప్రతిరంగం, అన్నీ 12ఏళ్లలో నాశనమయ్యాయి. నేడు మొత్తం ఉత్తరభారతదేశంలో శ్వాసతీసుకోవడం కూడా కష్టంగా మారుతోంది.

## యుద్ధ వాతావరణం..ఎయిర్‌పోర్ట్‌లో చిక్కుకుపోయిన పి.వి. సింధు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్ దేశాన్ని టార్గెట్ చేసుకొని యుద్ధ విమాణాలతో విరుచుకుపడ్డాయి. దీంతో ఆగ్రహించిన ఇరాన్ బహ్రెయిన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా మరియు UAE వంటి ప్రాంతాలపై ప్రతికార దాడులు చేసింది. దీంతో అప్రమత్తం అయిన ఆయా దేశాలు వారి గగనతలాన్ని మూసివేశారు. ఈ కారణంగా వివిధ దేశాలకు వెళ్లాల్సిన విమానాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి. సింధు దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లో చిక్కుకుపోయారు.

ఇంగ్లండ్‌లో జరగబోయే 'ఆల్ ఇంగ్లండ్ ఓపెన్' టోర్నమెంట్‌కు వెళ్తుండగా, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య తలెత్తిన యుద్ధ ఉద్రిక్తతల వల్ల విమాన సర్వీసులు నిలిచిపోవడంతో ఆమె అక్కడ ఆగిపోవాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్ట్ పైన క్షిపణులను అడ్డుకుంటున్న శబ్దాలు వినబడుతున్నాయని, పరిస్థితి చాలా భయంకరంగా ఉందని ఆమె సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతానికి తాను, తన బృందం సురక్షితంగానే ఉన్నామని, అయితే ఎయిర్‌పోర్ట్ అంతా గందరగోళంగా ఉందని సింధు తన పోస్టులో తెలిపారు. అనేక కుటుంబాలు ఇక్కడ ఇబ్బందులు పడుతున్నాయని, సాధారణ జీవితం ఎంత సున్నితమైనదో ఇలాంటి సమయాల్లోనే అర్థమవుతుందని ఆమె పేర్కొన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి సంబంధించిన వార్తలు, గల్ఫ్ దేశాలపై జరుగుతున్న క్షిపణి దాడుల నేపథ్యంలో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం తన కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే.

## ఖమేనీది ఒక దారుణమైన హత్య- ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించింది: పుతిన్

రష్యా, అమృత్ తెలంగాణ: ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హత్యను రష్యా తీవ్రంగా ఖండించింది. ఖమేనీ మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కు తన ప్రగాఢ సంతాప సందేశాన్ని పంపించారు. ఖమేనీ మరణం ఒక దారుణమైన హత్య అని, ఇది మానవ నైతికతకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అన్ని రకాల అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ ఇజ్రాయెల్ దాడి చేసిందని పుతిన్ మండిపడ్డారు. మరోవైపు, యుద్ధం కారణంగా గగనతలం మూసివేయడంతో రష్యా పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



# ఇరాన్‌పై అమెరికా దాడి......
# దాడిలో ఆ దేశ అధ్యక్షుడు మృతి
## అంతర్జాతీయ న్యాయానికి విఘాతం, శాంతికి ముప్పు

అమృత్ తెలంగాణ మధ్యప్రాచ్యం మరోసారి అగ్నికుండంలా మారుతోంది. ఇరాన్ పై అమెరికా చేపట్టిన దాడులు ప్రపంచ శాంతి, అంతర్జాతీయ న్యాయం, స్వావలంబన హక్కులపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన దేశంగా భావించబడే అమెరికా, సైనిక శక్తిని ఆధారంగా చేసుకుని సమస్యలను పరిష్కరించాలనే ధోరణి ప్రదర్శించడం ఆందోళనకరమైన పరిణామం.

అంతర్జాతీయ వ్యవస్థలో ప్రతి దేశానికి సార్వభౌమాధికారం ఉన్నది. ఒక దేశం మరొక దేశంపై ఏకపక్షంగా సైనిక చర్యలు చేపట్టడం యునైటెడ్ నేషన్స్ చట్టాల స్ఫూర్తికి విరుద్ధం. ప్రపంచ శాంతి, భద్రత పరిరక్షణ కోసం ఏర్పాటైన ఐక్యరాజ్యసమితి వ్యవస్థను పక్కనపెట్టి సైనిక దాడులకు దిగడం అంతర్జాతీయ క్రమాన్ని బలహీనపరుస్తుంది.

అమెరికా తరచూ తన చర్యలను "భద్రతా ప్రయోజనాలు", "అణు విస్తరణ నిరోధం" వంటి కారణాలతో సమర్థించుకుంటుంది. కానీ ఇలాంటి చర్యలు గతంలో కూడా మధ్యప్రాచ్యంలో తీవ్ర అస్థిరతకు దారి తీసిన అనుభవం ఉంది. సైనిక దాడులు సమస్యలను పరిష్కరించకపోగా, కొత్త ఘర్షణలకు, తీవ్రవాదానికి, శరణార్థి సంక్షోభాలకు కారణమవుతాయి. యుద్ధం చివరకు సాధారణ ప్రజల ప్రాణాలు, జీవనోపాధులనే బలితీసుకుంటుంది.

ఇరాన్‌పై దాడులు ప్రాంతీయ శక్తిసమీకరణాలను మరింత సంక్లిష్టం చేసే ప్రమాదం ఉంది. మధ్యప్రాచ్యంలో ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలు మరింత పెరిగితే, అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. చమురు సరఫరాల అంతరాయం, మార్కెట్ల అస్థిరత, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు అనివార్యమవుతాయి. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపై కూడా దీని ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో శాంతియుత చర్చలు, దౌత్యపరమైన మార్గాలే సరైన పరిష్కారం. పరస్పర గౌరవం, సమానత్వం, చట్టపరమైన ప్రక్రియలను గౌరవించడం ద్వారా మాత్రమే శాశ్వత శాంతి సాధ్యమవుతుంది. శక్తి ప్రదర్శన కాకుండా సంభాషణ, నమ్మకం, ఒప్పందాల ద్వారా సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచ సమాజం ఈ పరిణామాన్ని కేవలం వీక్షకుడిగా చూడకూడదు. యుద్ధోన్మాదాన్ని నిరోధించేందుకు అంతర్జాతీయ ఒత్తిడి అవసరం. శాంతి, ప్రజాస్వామ్యం, మానవ హక్కులను కాపాడాలంటే, శక్తివంతమైన దేశాలే ముందు బాధ్యత వహించాలి.

ఇరాన్‌పై అమెరికా దాడి కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణ మాత్రమే కాదు; ఇది అంతర్జాతీయ న్యాయవ్యవస్థకు ఒక పరీక్ష. శాంతి మార్గాన్నే ఎంచుకోవాలనే సందేశాన్ని ప్రపంచం గట్టిగా వినిపించాల్సిన సమయం ఇది.



కేఎల్ రాములు అమృత్ తెలంగాణ తెలుగు దినపత్రిక
నిర్మల్ జిల్లాడ నిజాంబాద్ బ్యూరో ఇన్చార్జి

# మున్సిపల్ వైస్ చైర్మన్ ను ఘనంగా సన్మానించిన మిత్ర బృందం


మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తిని ఘనంగా సన్మానిస్తున్న మిత్ర బృందం


నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్మన్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన డిగ్రీ కాలేజ్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా.

నిర్మల్ జిల్లా మార్చ్ 1 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి, ని 1993,96 బిఎస్సి బిజెడ్ సి బ్యాచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మిత్ర బృందం తన మిత్రుడు ఉన్నత పదవులు అధిరోహిస్తూ ప్రజల మనలను పొందుతు ఉన్నత పదవిల్లో ఉండడంతో మిత్ర బృందం గర్వంతో శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది మునుముందు నిర్మల్ పట్టణ ప్రజల సేవ కొరకు ఉన్నతమైన పదవులను అధిరోహించాలని ఆకర్షించారు ఈ కార్యక్రమంలో ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కంకట మాజీ సర్పంచ్ శ్రవణ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధుకర్, కృష్ణ గౌడ్, శ్రీ ప్రియ, హనీపా, విజయ, ఉషన్న, లెనిబు బాబు, పాల్గొన్నారు


నిర్మల్ పట్టణంలోని గాంధీచౌక్ లో గల మురళి కృష్ణ ఆలయం ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మేడారం ప్రదీప్ గారు తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి గారిని తెలంగాణ ముస్లిం ఎంప్లాయ్ అసోసియేషన్ ఘనంగా సన్మానించడం జరిగింది.

# 46 కోట్ల 89 లక్షల 60 వేల రూపాయల నిధులు మంజూరు..
## ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్..... గ్రామాల్లో జోరుగా కొనసాగనున్న అభివృద్ధి పనులు

నిర్మల్ జిల్లా ముధోల్ మార్చ్ 1 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గంలో గ్రామాల్లో నూతనంగా గ్రామ పంచాయతీ భవనాలు, మహిళ సమైక్య భవనాలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడ నిర్మాణాలకు నిధులను ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తన కోటా లో 46 కోట్ల 84 లక్షల 60 వేల రూపాయలనిధులను మంజూరు చేయించారు. గతం లో మంజూరు అయినవి కాకుండా ఒకే సారి పెద్ద మొత్తం లో నిధులను తెచ్చారు.దీనికి సంబందించిన ప్రొసీడింగ్ కాపీ లను సర్పంచ్ లకు, నాయకులకు అందించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు పెద్ద మొత్తం లో నిధులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు.ప్రతి గ్రామానికి పెద్ద మొత్తం లో నిధులు మంజూరైనందుకు ప్రజల్లో హర్షం వ్యక్తమవుతుంది.. మునుముందు గ్రామాల అభివృద్ధికి నిరంతరం సేవలు అందిస్తూనే ఉండలని ప్రజలు కోరుకుంటున్నారు


అభివృద్ధి పనుల ప్రెసిడెంట్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

# మున్నూరు కాపు సంఘం కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి


బోరంచు శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు మున్నూరు కాపు సంఘం నాయకులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా అదిలాబాద్ గ్రామీణ మండలం లో యాపల్ గూడలో నిర్మించిన మున్నూరు కాపు కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం ఘనంగా సాగింది. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యక్రమానికి హాజరై కులస్తులకు అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డి ని కులస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యాపల్ గూడ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు అరిగేలా కిష్టయ్య ,ప్రధాన కార్యదర్శి కుంచెట్టి సంతోష్ ,ఉపాధ్యక్షులు తోట నాగేష్ , పట్టేపు సురేష్, మావల సర్పంచ్ దర్మపురి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ స్వప్న అడెల్లు, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి ,పుంద్ర నర్సింగ్ , ఆలిమ్, కొనిగేల నారాయణ,పెద్ద కాపు గంట జైరాం,భాస్కర్, అశోక్,సతీష్ మొదలగు కుల సభ్యులు తదితరులు ఉన్నారు.

# పదిలంగా గమ్యాన్ని చేరుకోండి
## మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు. నమోదు చేస్తాం
## నర్సాపూర్ జి జాతీయ రహదారిపై విస్తృతంగా వాహనాల తనిఖీ చేసిన ఎస్ఐ గణేష్......


నర్సాపూర్ జి లో జాతీయ రహదారిపై విస్తృతంగా వాహనాలను పనిచేస్తున్న ఎస్సై గణేష్




నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 1 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మార్కెట్ ఏరియాలో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు స్థానిక ఎస్సై గణేష్, ఆధ్వర్యంలో తన సిబ్బందితో నాకబంది నిర్వహించినారు. ఇట్టి నాకాబందిలో ధ్రువపాత్రలతో పాటు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన 28 వాహనాలపై జరిమానా విధించడం జరిగినది. అలాగే మైనర్ డ్రైవింగ్ చేస్తున్న మరియు డ్రంకెన్ డ్రైవ్ చేసి మోటారసైకిల్ నడిపి దొరికిన ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినాము. ఇందులో భాగంగా వాహనాలు తనిఖీ చేసి వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పక ధరించాలని, ధ్రువపత్రాలు వెంట తెచ్చుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని మరియు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు నర్సాపూర్ జి ఎస్ ఐ గణేష్ తెలిపారు

# మున్సిపల్ చైర్మన్ దంపతులను శాలువాలతో సన్మానించిన 45 వార్డు కాలనీ వాసులు...

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో స్థానిక భుక్తాపూర్ వార్డు 45 వాసులు ..వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీలో నిలిచి విజయం సాధించి అదిలాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన బండారి అనూష సతీష్ దంపతులను వార్డు ప్రజలు శాలువాలతో సన్మానించి... వది సమస్యలను మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు... ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... ఎండలు తీవ్రంగా ఉన్నాయని అందరు కూడా జాగ్రత్తలు పాటించాలని కోరారు.



# వినాయక ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా చాంద టి గ్రామం దగ్గర నూతనంగా ఏర్పాటైన వినాయక ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ప్రారంభోత్సవానికి విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డి ని ఇండస్ట్రీస్ నిర్వాహకులు సి.ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డిఇంటి నిర్మాణం సీలింగ్ లో ఉపయోగించే ఛానెల్స్ తయారీ మెషిన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మనఆదిలాబాద్ చుట్టుపక్కల దాదాపు 200 కిలో మీటర్లలో ఎక్కడా లేని ఈ పరిశ్రమ ఆదిలాబాద్ లో ప్రారంభంఅవ్వడంశుభపరిణామమని,ఈ సందర్భంగా ఇండస్ట్రీస్ యజమాన్యానికి అభినందనలు తెలిపారు. నూతన పరిశ్రమల ఏర్పాటుతోస్థానికంగాఉద్యోగఅవకాశాలు మెరుగుపడతాయని అన్నారు.తెలంగాణ ప్రజా ప్రభుత్వం చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ వారికీ ఎన్నో రాయితీలు కల్పిస్తోందని గుర్తుచేశారు. శ్రీకాంత్ రెడ్డి గ వెంట మావల సర్పంచ్ దర్మపురి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ స్వప్న అడెల్లు,మాజీ వైస్ఎంపీపీ అట్లగోవర్ధన్ రెడ్డి , ఆలిమ్ తదితరులు ఉన్నారు.



# ఘనంగా ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపన ...

## పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా పాల్గొన్న అన్ని పార్టీల నాయకులు.....

## ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, ప్రజా ట్రస్టు చైర్మన్ మోహన్ రావు పటేల్.....





శివాజీ విగ్రహ ప్రతిష్టపణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్ ముధోల్ నియోజకవర్గం నాయకులు

నిర్మల్ జిల్లా భైంసా మార్చ్ 1 అమృత్ తెలంగాణ భైంసా మండలం రాజా పాంగ్రీ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్, యొక్కలి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభావంగా విజయవంతంగా నిర్వహించడం జరిగింది దీనికి గ్రామస్థుల ప్రత్యేక ఆహ్వానం మెరకు అన్ని పార్టీల నాయకులు ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లె మోహనరావు పటిల్, ముఖ్య అతిథిగా హజరు అయి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది నాయకులు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ధైర్యసాహసాల ప్రతీకగా నిలిచిన మహానుభావుడు. హిందూవులను ఐక్యమత్యం చేసి మొగాలులను మట్టికరిపించిన చక్రవర్తి శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ అని స్వరాజ్య స్థాపన కోసం జీవితన్ని అకింతం చేసిన గొప్ప మహానుభావుడులి శ్రీ శ్రీ శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ అని వారి యొక్క అడుగు జాడలలో ప్రతి యువత నడవాలని శివాజీ మహారాజ్ గారిని ఆదర్శంగా తీస్కొని ప్రతి వ్యక్తి సమాజంలో మంచి వైపు అడుగులు వేయాలని రాజా పాంగ్రీ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ యొక్క విగ్రహ



పాల్గొన్న ఆల్ పార్టీ నాయకులు

ప్రతిష్టపన కార్యక్రమంలో వారు మాట్లాడడం జరిగింది. ఈలి కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రామస్థులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేయడం జరిగింది మోహన్ రావు పటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ – భైంసా

# అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఓదార్పు

## తానూర్ మండలం లోని బోసి, హంగిర్గ గ్రామంలో పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి,.....

నిర్మల్ జిల్లా తానూర్ మార్చ్ 1 అమృత్ తెలంగాణ తాండూర్ మండలం లోని బోసి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ ఉత్తం భలేరావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆదివారం పరామర్శించడం జరిగింది అలాగే హంగీర్ఘ గ్రామంలోని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగనాథ్ కాక ఆరోగ్యం బాగాలేక వారిని కూడా పరామర్శించడం జరిగింది. వారి వెంట మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగర్ బాయి రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోత రెడ్డి, హంగీర్గా మాజీ సర్పంచ్ పోషెట్టి విడిసి కార్య దర్శి రాజ్ కుమార్ తది తరులు ఉన్నారు



అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

# భైంసా ఆశ్రమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సూపర్ స్టార్లు




క్రీడల్లో విజయాలు సాధించిన విద్యార్థులతో

నిర్మల్ జిల్లా భైంసా మార్చ్ 1 భైంసా పిఎం కప్ పోటీల్లో పాల్గొన్న పాఠశాలలు జిల్లా స్థాయి(నిర్మల్ )లో జరిగినటువనశీటి ఆటల పోటీలలో భాగంగా ఆశ్రమ పాఠశాల(భైశీసా) కు చెందిన బాలికలు వాలీబాల్, కబడ్డీ, ఖో– ఖోడఅథ్లెటిక్స్ పోటీలలో మొదటి బహుమతి పొంది రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎన్నికవ్వడం జరిగిశీది. ఈ కార్యక్రమంలోడీఈవో , భూక్యా రమేష్, ప్రధానో పాధ్యాయురాలు డి .స్వర్ణమాంజుల, సంగీత(పీడీ ) తదితరులు పాల్గొన్నారు

# కన్నుగుట్టలో శబరిమత 2వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

## భక్తుల కోరిక మేరకు వెంటనే రూ.10 లక్షలతో షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఆడే గజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆడే గజేందర్



శబరిమత పల్లకి సేవలో పాల్గొన్న ఆడే గజేందర్ దృశ్యం

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ ప్రజల విశ్వాసం, భక్తి, సేవాభావంతో చేసే ప్రతి పనికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, శబరిమత ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం కొనసాగిస్తా – ఆడే గజేందర్ బోథ్ మండలంలోని కన్నుగుట్ట గ్రామంలో శబరిమత 2వ వార్షికోత్సవ కార్యక్రమం భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ నియోజకవర్గ ఆడే గజేందర్ హాజరయ్యారు ఈ సందర్భంగా శబరిమత భక్తులు కోరిన వెంటనే స్పందించిన ఆడే గజేందర్ అమ్మవారి ఆలయ పరిసరాలలో భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు రూ. 10 లక్షల అంచనా వ్యయంతో షెడ్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. భక్తుల సమస్యలను వెంటనే పరిష్కరించే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని భక్తులు కొనియాడారు.

అమ్మ ఆశీసులు ఆడే గజేందర్ ఎల్లప్పుడూ ఉంటాయని, శబరిమత సేవలో ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని భక్తులు పేర్కొన్నారు కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు

# రూ.2,50,000/- LOC మంజూరు చేయించి బాధితుడి ఇంటికి వెళ్లి అందించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ : ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ CMRF ద్వారా బోథ్ నియోజకవర్గంలోని బోథ్ మండలంలోని కన్నుగుట్ట గ్రామానికి చెందిన దుబ్బ శంకర్ గారికి రూ 2,50,000 రాజ మంజూరు చేసి ఈ రోజు వారి ఇంటికి వెళ్లి అందించారు

# శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్





అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ బోథ్ మండలంలోని కన్నుగుట్ట గ్రామంలో జరిగిన సద్గురు శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారు మాట్లాడుతూ.. శబరిమాత భక్తుడిగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ప్రజలు భక్తి మార్గంలోనే నడవాలని ఆన్లైన్ యుగాలకు పిల్లల్ని దూరం ఉంచాలని అన్నారు.

కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచులు రూప్చంద్, రవి, గంగమల్లు తదితరులు ఉన్నారు

# అంతిమయాత్రలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



అమృత్ తెలంగాణ తలమడుగు మండల్ న్యూస్ : తలమడుగు మండలంలోని (బరంపూర్ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర్ రెడ్డి తండ్రి ముడుపు భూమరెడ్డి స్వర్గస్తులవగా వారి అంతక్రియలు బరంపూర్ గ్రామంలో జరగగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి పార్థివదేహానికి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన అదనపు కలెక్టర్ శ్యామల దేవి



అదనపు కలెక్టర్ శ్యామల దేవి దంపతులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ మరియు అధికారులు



హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఆదివారం స్థానిక రెవెన్యూ గార్డెన్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్యామలాదేవి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన 'ఆత్మీయ సన్మాన' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రాజర్షిషా. పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి వర్ణ, వివిధ శాఖల అధికారులు, బంధువులు, పట్టణ ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు. పాల్గొన్నారు

# బడిబాటకు విశేష స్పందన



ఆలేరు :అమృత్ తెలంగాణ: ఆలేరు మండలం టంగుటూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ జూకంటి అనిల్ కుమార్ మరియు పదిమంది వార్డు మెంబర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి గ్రామస్తుల నుండి విశేష ఆదరణ లభించింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామంలో విద్యా చైతన్యాన్ని కలిగించింది.

ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్న 68 మంది విద్యార్థులు టంగుటూరు ప్రాథమిక పాఠశాల మరియు ఉన్నత పాఠశాలలో చేరేందుకు సిద్ధం కావడం ఈ కార్యక్రమం విజయాన్ని సూచిస్తోంది. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న నాణ్యమైన విద్యా కార్యక్రమాలు, సదుపాయాలు, విద్యార్థుల ప్రగతి గురించి గ్రామస్తులకు వివరించారు. అలాగే గ్రామంలోని పాఠశాలలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చొరవతో అవగాహన కల్పించారు.

విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేసిన గ్రామ సర్పంచ్ మరియు వార్డు మెంబర్లను గ్రామస్తులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హితవరు కట్ట రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కోడం రమాదేవి, రవికుమార్, శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, వెంకటేష్, లింగయ్య, గ్రామ యువకులు, పాఠశాల హితవులు, పెద్దలు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు పూర్తయ్యాక ప్రతి రాష్ట్రం తెలంగాణ వైపే చూస్తోంది..



మునుగోడు : అమృత్ తెలంగాణ: దేశంలో ఏ రాష్ట్రంలో చేయలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్ పథకాన్ని తీసుకొచ్చిందని, ఈ పాఠశాలలు పూర్తయిన తర్వాత దేశంలోని ప్రతి రాష్ట్రం తెలంగాణ వైపు చూడడం ఖాయం అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడులోని దుబ్బ కాలువ రోడ్డులో రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, టీ జీ ఈ డబ్ల్యు ఐ డి సి ఎండి గణపతి రెడ్డి గార్లతో కలిసి భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్ననాడు చదువుకునేటప్పుడు బడిలో కులాల గురించి తెలియదని అన్నారు.

అన్ని కులాల వాళ్ళం ఒకే బడిలో చదువుకునేవాళ్ళమని, మళ్లీ ఇప్పుడు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో కులాలకు అతీతంగా అందరూ కలిసి చదువుకోవచ్చు అని అన్నారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో రూ. 200 కోట్ల వ్యయంతో 2500 మంది విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణం చేసుకోవడం శుభపరిణామం అని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో 79 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు.

వీటిలో సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు చదువుకోబోతున్నారు అని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం విద్య వైద్యాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. కొందరికి బర్లిచ్చారు, కొందరికి గొర్లిచ్చారు, కొందరికి చేప పిల్లలు ఇచ్చారు కానీ నాణ్యమైన విద్యను అందించలేదు అని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి, సీమాంధ్ర కాంట్రాక్టర్లకు దోచిపెట్టిందని మండి పడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో రూ. 76 లక్షల ముప్పై ఐదువేల 115 మంది విద్యార్థిని విద్యార్థులు తెలంగాణ రాష్ట్రంలో చదువుతున్నారు.

ప్రైవేట్ సెక్టార్ లో 44 లక్షల మంది విద్యార్థులు చదివితే ప్రభుత్వ సెక్టార్లో 24 లక్షల మంది చదువుతున్నారు అని అన్నారు. తెలంగాణలో విద్య మొత్తం కార్పొరేట్ చేతిలోకి వెళ్ళిపోయిందని తెలిపారు. కనీసం 50 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ ఇన్స్టిట్యూషన్స్లో చదివే అవకాశం రావాలి అని అభిప్రాయపడ్డారు. బడ్జెట్లో విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలని, బడ్జెట్లో 10 నుండి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తే లక్ష్యం నెరవేర్చుకోవచ్చని ప్రభుత్వానికి సూచించారు.

మునుగోడు నియోజకవర్గంలో 330 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని వెల్లడించారు. వీటిలో చదివే విద్యార్థుల సంఖ్య 9, 700 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని ప్రజలకు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మెస్ చార్జీలను పెంచాం, విద్య విషయంలో రాబోయే రోజుల్లో చాలా చేయాల్సి ఉంది అని అన్నారు. హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉన్న మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధి లేదు, నల్గొండ జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం మునుగోడు నియోజకవర్గం అని అన్నారు. మునుగోడు నియోజకవర్గంకు మొట్టమొదటి అడుగు ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం నల్గొండ జిల్లా అంటే రాష్ట్ర రాజకీయాల్లో టైగర్ జూన్ , రాజకీయాలను శాసించే జిల్లా నల్గొండ అని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత ఉంది: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రభుత్వ పాఠశాలలలో టీచర్ల కొరత తీవ్రంగా ఉందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూలు ప్రారంభ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజ్ గోపాల్ రెడ్డి తనవంతు ప్రయత్నం చేస్తున్నారు అని అన్నారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించే ప్రయత్నం జరుగుతుంది

# జాన్వీకపూర్ కి మళ్లీ షాక్ ఇచ్చిన యూనిట్!



ఆ సినిమా విడుదల వాయిదాతో జాన్వీ కపూర్ ఇబ్బంది పడుతోందా? కొత్త ఏడాది ఆరంభంలోనే అమ్మడికి ఇక్కట్లు తప్పడం లేదా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది ఆ సినిమా విడుదల వాయిదాతో జాన్వీ కపూర్ ఇబ్బంది పడుతోందా? కొత్త ఏడాది ఆరంభంలోనే అమ్మడికి ఇక్కట్లు తప్పడం లేదా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. ప్రస్తుతం జాన్వీ కపూర్ లో బాలీవుడ్ లో 'పరమ్ సుందరి', 'సన్నీ సంస్కారీకి తులసీ కుమారీ'లో నటిస్తోంది. వీటితో పాటు తెలుగులో రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న 16వ చిత్రంలోనూ నటిస్తోంది. అయితే ఏప్రిల్ లో రిలీజ్ కావాల్సిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారీ' మరోసారి వాయిదా పడింది. అనుకున్న టైమ్ లో షూటింగ్ పూర్తి కాకపోవడంతో వాయిదా వేసారు. ఈ సినిమా ఇంకా 25 రోజులు షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంది. దీంతో ఈ సినిమా ఎప్పుడు షూటింగ్ పూర్తవుతుంది? ఎప్పుడు రిలీజ్ అవుతుంది? అన్న దానిపై మరోసారి నీలి నీడలు కమ్ముకున్నాయి. అయితే ఈ సినిమా ఇలా వాయిదా పడటం కారణంగా జాన్వీ కి ఇతర సినిమాలతో డేట్లు క్లాష్ అవుతున్నాయట. ముఖ్యంగా రామ్ చరణ్ తో నటిస్తోన్న సినిమా షూటింగ్ కి అంతరాయం ఏర్పడుతుందట. జాన్వీ కపూర్ 25 రోజుల్లో 15 రోజుల పాటు కంటున్యూగా షూటింగ్ కి హాజరవ్వాల్సి ఉందట. అయితే చరణ్ సినిమాకి కేటాయించిన డేట్లలోనే ఈ 15 రోజులు కూడా క్లాష్ కి వస్తున్నాయట. దీంతో జాన్వీ కపూర్ కి ఏం చేయాలో అర్థం కాని సందిగ్ధంలో పడిందంటున్నారు. ఒకే సమయంలో ముంబై టూ హైదరాబాద్ తిరగడం సాధ్యం పడదు. రెండు సినిమాల షూటింగ్ ఒకే చోట అయితే ఇబ్బంది ఉండదు 'సన్నీ సంస్కారీ కి తులసీ కుమారి' షూటింగ్ లను ఇప్పటివరకూ అలాగే బ్యాలెన్స్ చేసుకుంటూ వచ్చింది. కానీ రామ్ చరణ్ సినిమా షూటింగ్ హైదరాబాద్ లో జరుగుతుంది కాబట్టి వీలు పడదు. ఈ నేపథ్యంలో డేట్లు క్లాష్ అవ్వకుండా చరణ్ మేకర్స్ నో, హిందీ సినిమా వాళ్లనే సర్దుబాటు చేయమని అడగాల్సిన పరిస్థితి. డిలే కారణంగా వాయిదా వేసారు కాబట్టి ఈ విషయంలో బాలీవుడ్ మేకర్సే వెనక్కి తగ్గాల్సి ఉంటుంది. ఇప్పటికే చరణ్ సినిమాకి సంబంధించి జాన్వీ షెడ్యూల్ ఫిక్స్ అయింది.

# టెంపర్ బ్యూటీ మరణ వార్తలు.. అసలు మ్యాటర్ ఇదే!




నోరా ఫతేహి గురించి తెలుసుకునేందుకు చాలా మంది ఆమెను సోషల్ మీడియా ద్వారా పలకరించారు. పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా బంగీ జంపింగ్ చేసేందుకు ప్రయత్నించిన నోరా ఫతేహి ప్రమాదవశాత్తు మరణించింది అంటూ సోషల్ మీడియాలో పుకార్లు వచ్చాయి. అందుకు సంబంధించిన ఒక వీడియో సైతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అడవిలో చేసిన ఆ జంపింగ్ సమయంలో ప్రమాదం జరిగి మహిళ కింద పడ్డట్టుగా వీడియోలో ఉంది. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి నోరా ఫతేహి అన్నట్లు అనిపిస్తుంది. దాంతో ఆమె ఫ్యాన్స్తో పాటు నెటిజన్స్ అంతా షాక్ అయ్యారు. నోరా ఫతేహి గురించి తెలుసుకునేందుకు చాలా మంది ఆమెను సోషల్ మీడియా ద్వారా పలకరించారు దుల్లగొడుతున్నాం ప్రమాదం జరిగినట్లు చూపించిన వీడియో మార్ఫింగ్ అయ్యి ఉంటుందని మొదటి నుంచి కొందరు అంటున్నా, అలా చేయాల్సిన అవసరం ఎవరికి ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తంగా ఎన్టీఆర్ టెంపర్ సినిమాలో ఐటెం సాంగ్ చేసి తెలుగు ప్రేక్షకులకు సైతం సుపరిచితురాలైన బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి చనిపోయిందనే వార్తలు ప్రముఖంగా వచ్చాయి. కొన్ని గంటల్లోనే వార్తలు దావానంలా వ్యాప్తి చెందడంతో వెంటనే ఆమె టీం స్పందించింది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మవద్దు అంటూ వారు పేర్కొన్నారు. ఆ వీడియోలో ఉన్నది నోరా కాదని వారు క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం నోరా ఫతేహి తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకుంటుంది. సోషల్ మీడియా ద్వారా తన పుట్టిన రోజుకు సంబంధించిన ఫోటోలను వీడియోలను షేర్ చేస్తూ వచ్చింది. దాంతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నిజం కాదని మరోసారి క్లారిటీ వచ్చింది. కొందరు కావాలని ఆ వీడియోను మార్ఫింగ్ చేశారని, అలాంటి పనులు చేయడం ద్వారా సెలబ్రెటీల అటెన్షన్ దక్కించుకోవచ్చు అని భావిస్తున్నారేమో. కానీ పుకార్లను వ్యాప్తి చెందించడం ద్వారా సదరు సెలబ్రెటీ ఫ్యాన్స్, సన్నిహితులు ఎంతో ఆందోళనకు గురి అవుతారనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది కెనడాలోని టొరంటోలో పుట్టిన నోరా ఫతేహి బాలీవుడ్లో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చి సక్సెస్లను దక్కించుకుంది. మొరాకో సంతతికి చెందిన ఫ్యామిలీలో పుట్టిన నోరా ఫతేహి యార్క్ విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రంలో అంతర్జాతీయ సంబంధాలను అభ్యసించి గ్రాడ్యుయేషన్ దక్కించుకుంది. బాలీవుడ్లో సినిమాలతో అలరించిన నోరా చాలా సార్లు తాను భారతీయురాలిని అనే భావన కలుగుతుందని చెప్పుకొచ్చింది. బిగ్ బాస్ 9లో పాల్గొనడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. ప్రస్తుతం కాంచన 4 సినిమాతో పాటు మరో రెండు మూడు సినిమాల్లో నటిస్తోంది. తెలుగు ప్రేక్షకులకు ఐటెం సాంగ్స్తో చేరువ అయిన నోరా ఫతేహీ టాలీవుడ్లో ముందు ముందు మరిన్ని సినిమాల్లో నటించాలని కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చింది.

## చెప్పుతో కొట్టాల్సింది.. 'దంగల్' నటికి నిర్మాత సలహా!

అయితే టాలీవుడ్ లో కాస్టింగ్ ఏజెంట్లు 'ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నావా?' అని పదే పదే రెచ్చగొట్టారని ఫాతిమా వ్యాఖ్యానించారు. 'దంగల్' ఫేం ఫాతిమా సనా షేక్ దక్షిణాదిన తనకు కాస్టింగ్ కౌచ్ ఎదురైందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో నిర్మాతను చెప్పుతో కొట్టాల్సిందని తెలుగు నిర్మాత ముత్యాల రాందాస్ అన్నారు. కమిట్ మెంట్ అడిగిన నిర్మాతను నిలదీయాల్సిందని, చెప్పుతో కొట్టి, ఆ తర్వాత వేధింపుల నిరోధక కమిటీకి ఫిర్యాదు చేసి ఉండాల్సిందని రాందాస్ అన్నారు. తెలుగు సినీపరిశ్రమలో లైంగిక వేధింపుల అంశంలో బాధితుల తరపున కమిటీలు పని చేస్తున్నాయని కూడా ముత్యాల రాందాస్ తెలిపారు. ఆమిర్ ఖాన్ 'దంగల్' చిత్రంతో ఆరంగేట్రం చేసిన ఫాతిమా సనా షేక్, టాలీవుడ్లో కాస్టింగ్ కౌచ్ గురించి కొన్ని సంచలన వ్యాఖ్యలు చేసారు. ఫాతిమా బాలీవుడ్ బబుల్ తో మాట్లాడుతున్న ఇంటర్వ్యూ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దక్షిణాదిన నిర్మాతలు, కాస్టింగ్ ఏజెంట్లతో తన అనుభవాలను షేర్ చేసుకుంది. తాను బాలీవుడ్ లో అడుగుపెట్టక ముందు అవకాశాల కోసం తొలిగా దక్షిణాదిన ప్రయత్నించానని, అక్కడ నటిస్తే బాలీవుడ్ లో అవకాశాలు సులువుగా వస్తాయని ఆశించానని ఫాతిమా అన్నారు. మరో మసాలా సినిమాకి సీక్వెల్! అయితే టాలీవుడ్ లో కాస్టింగ్ ఏజెంట్లు 'ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నావా?' అని పదే పదే రెచ్చగొట్టారని ఫాతిమా వ్యాఖ్యానించారు. నేను కష్టపడి పనిచేస్తానని, పాత్రకు అవసరమైనది చేస్తానని వారికి చెప్పానని తెలిపింది. అయినా కాస్టింగ్ ఏజెంట్ పదే పదే అదే విషయం రిపీట్ చేసాడు. నేను మూగదానిని అయిపోయాను అని ఫాతిమా అన్నారు. హైదరాబాద్ లో పెద్ద, చిన్న నిర్మాతలు కాస్టింగ్ కౌచ్ గురించి చాలా బహిరంగంగా మాట్లాడుతారని తెలిపింది.




# నేను ఇడ్లీ బ్యూటీని..మూడు పూటలైనా నో ప్రోబ్లమ్!



సంవత్సరాలుగా సినిమాలు సెట్స్ లో షూటింగ్ దశలోనే ఉన్నాయి. నిధి అగర్వాల్ కెరీర్ లో నెమ్మదిగా సాగుతోన్న సంగతి తెలిసిందే. చెప్పుకోవడానికి చేతిలో 'హరి హర వీరమల్లు', 'రాజాసాబ్' లాంటి అగ్ర హీరోల చిత్రాలున్నా? వాటి రిలీజ్ విషయానికి వచ్చే సరికే ఏం చెప్పాలో తెలియని పరిస్థితి. సంవత్సరాలుగా సినిమాలు సెట్స్ లో షూటింగ్ దశలోనే ఉన్నాయి. ఆ ప్రాజెక్ట్ లపై నిధి చాలా ఆశలు పెట్టుకుంది. వాటితో సక్సెస్ అందుకుని బిజీ భామగా మారాలని చూస్తోంది. మరి ఈ ప్రయత్నం ఎంత వరకూ సక్సెస్ అవుతుందో చూడాలి. ఏం జరుగుతుంది? రెండు సినిమాలపై అంచనాలైతే భారీగా ఉన్నాయి. సక్సెస్ అయితే నిధి కి కలిసొచ్చే అవకాశాలు ఎక్కువ గానే ఉన్నాయి. ఆ సంగతి పక్కన బెడితే తాజాగా నిధి అగర్వాల్ కి ఇడ్లీ అంటే ఎంత ఇష్టమో ఎంత ఇష్టమో బయటకు వచ్చింది. ఆహార పదార్థాల్లో ఏది ఇష్టం అంటే? అమ్మడు వెంటనే ఇడ్లీ అని సమాధానం ఇచ్చింది. ఇడ్లీ ఉదయమే కాదు..మధ్యాహ్నం లంచ్ లో ...రాత్రి డిన్నర్ లో పెట్టినా ఇష్టంగా ఆరగిస్తుందిట. ఇంట్లో ఇడ్లీ ఉంటే ఇంకే పదార్థాలు అవసరం లేదుట. మూడు పూటలు ఇడ్లీ తినేసి సంతోషంగా ఉంటానంటోంది. సాధారణంగా ఇడ్లీ అంటే చాలా మంది ఇష్టడరు. కానీ నిధి అగర్వాల్ మాత్రం అలాంటి వాళ్లకు భిన్నం అంటోంది. ఇడ్లీ ఆరోగ్యానికి మంచిందంటోంది. ఇడ్లీ ఎక్కడ చూసినా నోరూరిపోతుందిట. ఇడ్లీ తర్వాత ఫ్రెంచ్ ఫ్రైస్ వీక్ నెస్ గా చెప్పుకొచ్చింది. డైటింగ్ వల్ల వాటికి దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు చాలా బాధపడుతుందిట.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com